క్లుప్తంగా

ఉల్లాసంగా..ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే ఆదివారం నిర్వహించారు. శ్రీనిత్య ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. స్నేహం చాలా గొప్పదని కుల, మత, ప్రాంత వ్యత్యాసాలు లేకుండా నిస్వార్థ సేవలందించేది ఒక్క స్నేహమేనని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగుమాల బ్రహ్మయ్య, బి.రాధాకృష్ణ, దండమూడి సీతారామస్వామి, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, డి.శ్యాంబాబు, చిన్నం గంగాధరరావు, సామి రామ్మోహన్, పి.నాంచారయ్య, బి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సచివాలయ భవనం ప్రారంభోత్సవం

మండవల్లి : ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు మండల్లి గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభిస్తారని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ప్రజాప్రతనిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రేపు సచివాలయ భవనం ప్రారంభోత్సవం

పారిశుద్ధ్య కార్మికులకు సాయం



కై కలూరు (కలిదిండి) : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ముందుగా స్నేహితులందరూ ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు పి.రవికుమార్, బి.భూషారావు, ఎం.సోమేశ్వరరావు, జి.సుబ్రహ్మణ్యం, కె.రాజాగుప్తా, పి.లలిత ప్రసాద్, వై.ఆరోగ్య జీవరత్నం, ఎస్.కృష్ణ, వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

గుడివాడ టౌన్: పీడితుల సమస్యలను తన గళం ద్వారా ప్రభుత్వానికి తెలియజెప్పిన గొప్ప విప్లవ కవి గద్దర్ మృతి దళిత సంఘాలకు తీరని లోటని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచెర్ల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఓదార్పు కలగాలని కోరుకుంటున్నామన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఉద్యోగాలకు 102 మంది ఎంపిక



మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 326 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 102 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. 162 మంది తరువాతి ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్య అతిథి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. మచిలీపట్నంలో 13 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విక్టర్‌బాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యం, ఎంజీఎస్ఎఫ్ సుదర్శన్, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ అదనపు నైపుణ్యాభివృద్ధి కార్యనిర్వాహకులు బీవీ సందీప్, జిల్లా నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, మచిలీపట్నం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ కె. దిలీప్, కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో రక్ష

- నియోజకవర్గంలో 35,632 ధ్రువీకరణ పత్రాల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్



మండవల్లి మండలంలో జగనన్న సురక్ష ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (ఫైల్)

కైకలూరు: మండల కేంద్రాల చుట్టూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తిరగాల్సిన అగచాట్లు తప్పాయి. ఇంటికొచ్చి మరీ మీకు ఏమైనా సర్టిఫికెట్లు కావాలా? అని వలంటీర్లు, అధికారులు వచ్చి అడుగుతున్న రోజులు వచ్చాయి. ఈ మార్పునకు కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గ్రామ స్థాయిలోనే అన్ని పనులు ఒకే చోటన లభించాలని సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సచివాలయంలో కొలువులు అందించారు.

92119 ఇళ్ల సర్వే..

నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో కలపి మొత్తం 79 సచివాలయాల్లో క్యాంపులు జరిగాయి. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కలిసి మొత్తం 92119 ఇళ్లను సర్వే చేశారు. కార్యక్రమం ముగిసేనాటికి మొత్తం వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు 35,632 పంపిణీ చేశారు. నియోజకవర్గాల వారీగా చేస్తే అధికంగా కైకలూరు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి క్యాంపునకు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ధ్రువీకరణ పత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

మండలాలవారీగా ధ్రువీకరణ పత్రాలు...

మండలం	శిబిరాలు	సర్వే గృహాలు	ధ్రువీకరణ పత్రాలు మంజూరు
కైకలూరు	22	21,418	11,486
కలిదిండి	20	21,933	8,029
మండవల్లి	16	17,318	5,971
ముదినేపల్లి	21	8,450	10,146
మొత్తం:	79	92,119	35,632

11రకాల సేవలు..

జగనన్న సురక్షలో కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబరు అనుసంధానం, మ్యూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, పంట సాగు హక్కు పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ తదితర సేవలు అందించారు.

కొత్త పద్ధతికి శ్రీకారం..

గ్రామాల్లో గత పాలనలో ఏమైనా ధ్రువపత్రాలు కావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో పనులు మానుకుని రోజులు తరబడి తిరిగేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. మండల సర్వేయరు, విద్యు త్‌శాఖ, రెవెన్యూ, వ్యవసాయం శాఖల అధికారులతో పాటు డిజిటల్ అసిస్టెంటు ఇలా అనేక కొలువులను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమయం ఆదా అయింది..



ఈ ఫొటోలోని యువతి మండలంలోని పెదపాలపర్రుకు చెందిన దాకరపు గంగాబాయమ్మ. డిగ్రీ విద్యను పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తక్కువ వ్యవధిలో కుల ధ్రువీకరణ పత్రాన్ని గ్రామంలోనే అధికారుల నుంచి తీసుకుంది. ఈ కార్యక్రమం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పనిలేకుండా పోయిందని సంతోషంగా తెలిపింది. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటానంటోంది.

గతంలో చాలా ఇబ్బందులు పడ్డా



ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన కొర్రా సోమేశ్వరి. ఈమె పిల్లలు కళాశాల విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు కావాల్సి ఉండడంతో స్థానిక వలంటీరు ద్వారా దరఖాస్తు చేయించగా రెండు రోజుల్లోనే జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకుంది. గతంలో వీటిని పొందడానికి తమ పిల్లలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు రెండు రోజుల్లోనే వచ్చాయని తెలిపింది.

170 మందికి వైద్య సేవలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ హైస్కూలులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణపతి లక్ష్మణరావు వర్ధంతి వర్ధంతి సందర్భంగా ఈ వైద్య శిబిరం జరిగింది. విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు గుండె, జీర్ణకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేవారు. శిబిరంలో 170 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగకిరణ్, డాక్టర్ సాయి, ఆసుపత్రి మేనేజర్ కల్యాణ్, కుటుంబ సభ్యులు గణపతి శివకుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, కార్యదర్శి చింతల భాస్కరరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌లు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, వీరిశెట్టి నరసింహారావు, సింగిరెడ్డి గగారిన్, అద్దేపల్లి పురుషోత్తం, రామకృష్ణ (ఆర్‌కే) తదితరులు పాల్గొన్నారు.

భైరవపట్నంలో శాంతి ర్యాలీ



మండవల్లి: మణిపూర్‌లో జరిగిన దాడులకు నిరసనగా మండలంలోని భైరవపట్నంలో విచారణకర్త ఫాదర్ కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులు అమానుషమన్నారు. కార్యక్రమంలో మెండా సురేష్, భైరవపట్నం గ్రామస్తులు, ఉపదేశకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయండి

ఎమ్మెల్యే డీఎన్నార్



కలిదిండి పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రామారావు, చిత్రంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు (కలిదిండి) : రైతుల సంక్షేమానికి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కృషి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వడుపు రామారావు కార్యాలయంలో పదవీ బాధ్యతలు ఆదివారం చేపట్టారు. అనంతరం కల్యాణి ఫంక్షన్ హాలులో అభినందన సభ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. రైతులకు రుణాలను అందిస్తూ ఆర్థిక చేయూత అందిస్తున్నారన్నారు. నూతన చైర్మన్ రామారావు మాట్లాడుతూ రైతులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పూర్వపు పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కనకదుర్గా రాణి, కలిదిండి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు గొరిపర్తి వెంకటరెడ్డి(జిమ్మిరెడ్డి), కమతం పరంకుశం, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ ఉపాధ్యక్షులు పాము రవికుమార్, సర్పంచ్ మసీముక్కుల మారుతి ప్రసన్న, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ చాన్‌బాషా, నాయకులు గొరిపర్తి సుబ్బారావు, కందుల వెంకటేశ్వరరావు, చిట్టూరి మురళి కృష్ణ, నీలపాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



కోడూరు: హంసలదీవి సాగర తీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవు దినంతో పాటు స్నేహితుల దినోత్సవం కూడా కావడంతో పోలీసులు తీరం వెంట బందోబస్తు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి వచ్చి సందడి చేశారు. గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి సరదాగా గడిపారు. యువత తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చి స్నేహితులతో కలిసి వివిధ రకాల ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు. మెరైన్ సీఐ పవన్ కిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, సిబ్బంది గస్తీ నిర్వహించారు.

స్వామివారి సన్నిధిలో ఏడీజీ అతుల్‌సింగ్

మోపిదేవి: అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ కుటుంబ సమేతంగా స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామి వారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సీహెచ్ పద్మ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు తొలగింపు

మండవల్లి : స్థానిక వెలమపేట రామాలయం ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపై ఇటీవల హైవే విస్తరణ పనుల సందర్భంగా నిలిచిన మురుగునీటి వల్ల వెలమపేట వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచి మెండా ఝాన్సి సూచన మేరకు సిబ్బంది రోడ్డుపై నిలచిన నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. రాకపోకలకు వెసులుబాటు కల్పించారు.

పార్కింగ్ నిర్వాహకులపై దాడి



మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వాహనాల పార్కింగ్ నిర్వాహకులపై ఆదివారం దాడి జరిగింది. ఎస్ఐ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. సింహాద్రి రాజా రమేష్ దేవస్థానంలో పార్కింగ్ నిర్వహిస్తున్నాడు. ఉయ్యూరు మండలం వీరవల్లి మొఖసా గ్రామానికి చెందిన కుక్కల వెంకటరత్నం ఆదివారం కారు పార్కింగ్ చేశాడు. తిరిగి కారు తీసుకుని వెళుతుండగా పార్కింగ్ ఫీజు చెల్లించాలని నిర్వాహకుడు రాజారమేష్ అడిగాడు. కారుకు ముందస్తుగా టోకెన్ తీసుకోలేదు.. బయటకు వెళ్లే సమయంలో రుసుం అడగడం ఏమిటని ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దారితీసింది. చేతిలోని కీ చెయిన్‌తో వెంకటరత్నం బలంగా పొడవడంతో రాజారమేష్‌కు గాయాలయ్యాయి. ఈ వివాదాన్ని ఆపేందుకు అడ్డువెళ్లిన సింహాద్రి పవన్, మదాల మహేష్‌లపై కూడా వెంకటరత్నం దాడి చేయడంతో వారు కూడా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో ప్రసంగిస్తున్న మద్దెల రామకృష్ణ

గుడివాడ టౌన్: గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దెల రామకృష్ణ అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని వంకదార కల్యాణ మండపంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ గుడివాడ శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గతంలో గిరిజన బిడ్డలు చదువుకు దూరమవ్వడం, ప్రభుత్వ పథకాలు చేరువకాక అట్టడుగు జీవితం జీవించేవారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్స్ అభ్యున్నతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి బ్యాంకు రుణాలు అందిస్తూ అన్ని ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా కృషిచేస్తుందన్నారు. ఈ సదవకాశాలను ట్రైబల్ బిడ్డలు వినియోగించుకుని ఉన్నత స్థితికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాఖ అధ్యక్షుడు శీలం దానయ్య, ప్రధాన కార్యదర్శి శీలం రాంబాబు, నాయకులు ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, సీనియర్ నాయకులు గద్దె రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం..ఆత్మీయ సమ్మేళనం



1981-82 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1981–1982వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అందరూ స్థానిక చల్లపల్లి రోడ్డులోని లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం సమావేశమయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాత్మ గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్ననాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆనందోత్సాహాలతో స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మధ్యాహ్నం 1981–82 ఏడాది పూర్వ విద్యార్థుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్. త్రివిక్రమరావు, కార్యదర్శిగా మేడిపల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా సురవరపు పెదవీరయ్య, గౌరవ సలహాదారుగా ఆకుల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా స్వర్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీపతి కోటేశ్వరమ్మలను ఎన్నుకున్నారు. రానున్న కాలంలో నూతన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి



పామర్రులో మాట్లాడుతున్న పామర్రు ప్రాజెక్టు సీడీపీవో భానుశ్రీ

పామర్రు: బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వీ భానుశ్రీ అన్నారు. స్థానిక సాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల శిశువుకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, బిడ్డ ఎదుగుదలపై చూపే ప్రభావం గురించి అవగాహన కలిగించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా ఆగస్టు 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికీ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువని తెలిపారు. రక్త హీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు రావన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా ప్రసవం అనంతరం అయ్యే రక్తస్రావం అదుపులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



గుడివాడ టౌన్: ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ వాటిని పరిష్కరిస్తున్న ఏకైక ఉద్యోగ సంఘం ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ అని కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఆదివారం గుడివాడ తాలూకా యూనిట్ ఎన్జీఓస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభ విజయవాడలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో జరిగే మహాసభల ప్రణాళికపై చర్చించి ఎన్జీఓలను సమాయత్తపర్చడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తొలుత మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఎన్జీఓలు పాల్గొంటారని, ప్రతి ఒక్కరూ ఈ మహాసభలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, గుడివాడ రూరల్ ఎంపీపీ గద్దె పుష్పరాణి, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమప్రసాద్, తాలూకా యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఫరీద్ భాషా, జి. రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాయకులు

కై కలూరు (కలిదిండి) : భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం గుర్వాయిపాలెంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. ముందుగా దళిత యువకులు, నాయకులు కలిదిండి నుంచి భారీ ర్యాలీని గుర్వాయిపాలెం వరకు నిర్వహించారు. విగ్రహ దాత పోసిన చెంచురామారావును ఈ సందర్భంగా సత్కరించారు. దళిత నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్, దళిత నాయకులు బొడిగడ్డ కిషోర్, కమతం సుబ్బయ్యదాస్, కుర్నేళ్ల అనిల్, బేతాళ మణి, భాగ్యరాజు, నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి దళిత యువత పాల్గొన్నారు.